క్లుప్తంగా

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు శివ



విద్యార్థి శివ

విజయనగరం: ఖేలో ఇండియా ఖోఖో పోటీలకు నగరంలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎం.శివ అర్హత సాధించాడు. ఈ నెల 4 నుంచి 6 వరకు బిహార్ రాష్ట్రంలోని గయాలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు శివ ప్రాతినిధ్యం వహించనున్నాడు. నగరంలోని కస్పా స్కూల్ పీడీ కె.గోపాల్ వద్ద ఈ విద్యార్థి శిక్షణ పొందుతున్నాడు. విద్యార్థిని కాలేజీ ప్రిన్సిపాల్‌తో పాటు జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పెనుమజ్జ విజయలక్ష్మి, సత్యనారాయణ, చైర్మన్ చిన్నంనాయుడు అభినందించారు.

నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి



కోరాడపేటలో నిర్వాసిత రైతులతో సీపీఎం నేత రామారావు

నెల్లిమర్ల రూరల్: తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ నిర్వాసితుల భూసమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల నేత కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. మండలంలోని కోరాడపేటలో నిర్వాసితులను శనివారం ఆయన కలిసి వారి పోరాటానికి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని రైతుల భూములను ప్రభుత్వ భూమిగా సిబ్బంది నమోదు చేశారని, ఆ భూమిని బాధిత రైతులకు అప్పగించిన తర్వాతే పనులు ప్రారంభించాలన్నారు. కోరాడపేట, ఏటీ అగ్రహారం నిర్వాసితులకు ఇప్పటి వరకు పునరావాసం కల్పించలేదని, నెల్లిమర్ల పట్టణంలో వారికి కేటాయించిన నివాస స్థలాలను తక్షణమే అప్పగించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

దుకాణాల్లో తనిఖీలు



దుకాణంలో తనిఖీలు చేస్తున్న సిబ్బంది

విజయనగరం: నగరంలో సచివాలయాల వారీగా దుకాణాల్లో కార్పొరేషన్ పారిశుద్ధ్య పర్యవేక్షకుడు, సచివాలయ కార్యదర్శులు సంయుక్తంగా శనివారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో నిషేధిత పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకుని అపరాధ రుసుము విధించారు.మరోసారి ఇదే విధానం అవలంబిస్తే అపరాధ రుసుములను రెట్టింపు చేస్తామని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. 20 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం ఉన్న పాలిథిన్ కవర్లు కానీ, ఇతర ప్లాస్టిక్ సామగ్రిని గాని వినియోగించవద్దని చెప్పారు. టిఫిన్ దుకాణాలు, ఇతరత్రా తినుబండారాల దుకాణాల్లో అరిటాకులు, విస్తరాకులు వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. ఇదే విషయమై పలుమార్లు ప్రచారం చేసినప్పటికీ కొంతమంది కవర్లు, ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇకపై ఇటువంటివి ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



భవ్యశ్రీకి నగదు అందజేస్తున్న శేఖర్, తదితరులు

విజయనగరం టౌన్: విద్యార్థుల అభ్యున్నతికి తమవంతు ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షల్లో 440 మార్కులకు 425 మార్కులు సాధించిన పట్టణానికి చెందిన కాసం భవ్యశ్రీకి కళాశాల ఫీజు నిమిత్తం జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ శనివారం రూ.33వేలు అందజేసింది. పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో విద్యార్థిని భవ్యశ్రీని జిల్లా ఆర్యవైశ్య మిత్రులు అభినందించారు. ఈసందర్భంగా శేఖర్ మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో గ్రూప్ ద్వారా ఆర్థిక సాయం పొందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు తెలిపారు. సభ్యుల సహాయ , సహకారాలతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ కార్యదర్శి డిమ్స్ రాజు మాట్లాడుతూ విద్య, వైద్యం, వివాహం తదితర కార్యక్రమాలకు తమ సంఘం ఆర్థికసాయమందిస్తోందన్నారు. కార్యక్రమంలో చారిటీ కోశాధికారి సముద్రాల నాగరాజు, సభ్యులు పెంటపాటి కామరాజు, మాచర్ల చంద్రశేఖర్ గుప్త, బి.వి.పి.ఎస్.రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

- వేసవి తాపం తీర్చుతున్న తాటి ముంజులు
- డీహైడ్రేషన్ నుంచి ఉపశమనం
- ఆరోగ్యానికి మేలు అంటున్న వైద్యనిపుణులు
- ముంజుల్లో పుష్కలంగా పోషకాలు, విటమిన్‌లు, ఖనిజ లవణాలు
- డజను రూ.60 నుంచి రూ.80

ఐస్ యాపిల్... పోషకాలు ఫుల్



విజయనగరంలోని అరుణ జూట్ మిల్లు వద్ద ముంజులు విక్రయిస్తున్న గీతకార్మికులు

విజయనగరం గంటస్తంభం: ప్రకృతి ప్రసాదించిన వేసవి వరం తాటి ముంజులు. వీటినే 'ఐస్ యాపిల్స్'గా పిలుస్తుంటారు. ఇవి చూడడా నికి జెల్లీలా, పట్టుకుంటే జారిపోయేంత మృదువుగా ఉంటాయి. తియ్యగా, నోట్లో వేసుకుంటే కరిగిపోయేలా ఉండే వీటి లోపలి భాగంలో నీరు ఉంటుంది. మంచి చలువ కూడా. కేలరీలు, విటమిన్లు అధికంగా ఉన్న ఈ ముంజులను తినడం ఆరోగ్యానికి మంచిదని వైద్య నిపుణు లు చెబుతున్నారు. తాటి ముంజుల్లో శరీరానికి కావాల్సిన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇది దాహార్తికి మంచి విరుగుడు కూడా. ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మేలు చేస్తాయి. అవేంటో తెలుసుకుందాం...

చలువ కోసం

తాటి ముంజుల్లో క్యాలరీలు తక్కువ మొత్తంలోనూ శరీరానికి కావాల్సిన శక్తి ఎక్కువ మొత్తంలో ఉంటుంది. వేసవిలో చలువ కోసం వీటిని తింటే మంచిది. కొంత మందికి ఎండాకాలంలో వేడి వల్ల ముఖంపై చిన్న చిన్న పొక్కుల్లా వస్తుంటాయి. వాటి నుంచి ఉపశమనం పొందాలంటే తాటి ముంజులు తినాల్సిందే.

డీహైడ్రేషన్ నుంచి ఉపశమనం

ఎండాకాలంలో ఎన్ని నీళ్లు తాగినా అది చెమట రూపంలో బయటికి వెళ్లిపోయి డీహైడ్రేట్ అయిపోవడం సర్వసాధారణం. ముంజుల్లో నీటి శాతం అధికంగా ఉండడం వల్ల వీటిని తింటే ఈ సమస్య ఉండదు. శరీరానికి కావాల్సిన ఖనిజాలు, చక్కెరలను ఇవి బ్యాలెన్స్ చేస్తాయి.

బరువును తగ్గిస్తాయి

శరీరానికి చాలా అవసరమైన విటమిన్లు ఏ,బి,సీలతో పాటు ఐరన్, జింక్, క్యాల్షియం, మెగ్నీషియం, పాస్పరస్, పొటాషియం, సోడియం, సల్ఫర్, కాపర్ లాంటి ఖనిజ లవణాలు కూడా సమృద్ధిగా ఉంటాయి.వీటిలో అధిక మొత్తంలో నీరు ఉండడం వల్ల శరీర బరువును తగ్గించడంలో ఇవి ఎంతగానో తోడ్పడతాయి.

విషపదార్థాలు మాయం

తాటి ముంజులు కాలేయ సంబంధ సమస్యలను కూడా తగ్గిసాయి. వీటిలో అధిక మొత్తంలో ఉన్న పొటాషియం శరీరంలోని విషపదార్థా లను తొలగిస్తుంది.

గర్భిణులకూ మంచిదే..

ప్రెగ్నెన్సీ సమయంలో కొంతమందికి ఏది తిన్నా జీర్ణం కాకపోవడం లాంటి సమస్య ఎదురవుతుంది. అలాంటి వారు తాటి ముంజులు తినాలి. ఫలితంగా జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. అంతే కాకుండా ఈ సమయంలో ఎదురయ్యే మలబద్ధకం, ఎసిడిటీ లాంటి ఆరోగ్య సమస్యలను కూడా దూరం చేస్తాయి. అలాగే శరీరంలో గ్లూకోజ్ స్థాయిని పెంచి, శరీరానికి కావాల్సిన మినరల్స్, న్యూట్రియంట్ల శాతాన్ని బ్యాలెన్స్ చేయడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి.

అలసట దూరం

వేసవిలో అలా కాసేపు బయటికి వెళ్లొస్తేనే అలసిపోతాం, అంతేకాదు విపరీతమైన చెమట కూడా పట్టేస్తుంది. ఫలితంగా అలసట చెందడం తో పాటు నిస్సత్తువగా మారిపోతాం. ఇలాంటి సమయంలో తాటి ముంజులు తినడం వల్ల శరీరానికి అధిక మొత్తంలో నీరు తిరిగి అందు తుంది. అలసట నుంచి ఉపశమనం పొందడానికి ఇది ఒక సులువైన మార్గం.

పొట్టు తీయకుండా తినాలి

చాలామంది ముంజుల పైన పొట్టులాగా ఉండే పైపొర తీసేసి తింటారు. కానీ ఆ పొట్టులోనే ఎన్నో రకాల పోషకాలుంటాయి. అనారోగ్యం తో బాధపడుతున్న వారికి అవి చాలా అవసరం. అలాగే ఈపొట్టు వల్లే శరీరానికి ఎక్కువ చలువ చేస్తుంది. కాబట్టి తాటి ముంజులను పొట్టు తీయకుండా తింటేనే మంచిది.

గుంకలాం నుంచి తెచ్చి విక్రయిస్తున్నా

ముంజులను గుంకలాం నుంచి తీసుకువస్తున్నా. నాతో పాటు మరో నలుగురం కలిసి వ్యాపారం చేస్తున్నాం. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ముంజులను విక్రయిస్తున్నాం. రోజురోజుకూ అమ్మకాలు పెరుగుతున్నాయి. డజను రూ.60 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నాం. సీజన్ పూర్తయ్యే వరకు ముంజులు అమ్ముతాం.

– రీస్ ఎర్రయ్య, గీత కార్మికుడు

చిత్రలేఖన పోటీలు

వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా డెంకాడ శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ వై.మహేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అందమైన చిత్రాలను గీసి ప్రతిభ కనబరిచారు. అలాగే విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు.

– డెంకాడ



వార్డు సందర్శన

సమస్యలు పరిష్కరించడానికే వార్డు సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నెల్లిమర్ల నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ తారక్‌నాథ్ చెప్పారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి జరజాపు పేటలోని 1,19, 20వ వార్డుల్లో వైస్ చైర్మన్ సముద్రపు రామారావుతో కలిసి శనివారం పర్యటించారు. ప్రజలతో మాట్లాడి వార్డుల్లో పారిశుద్ధ్య, తాగునీటి, రహదారులు, వీధి దీపాల నిర్వహణపై ప్రజలను ఆరా తీశారు. ప్రజలు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్లు కింతాడ కళావతి, తుమ్ము భారతి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఉమా భాస్కర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

– నెల్లిమర్ల



లేబర్ కోడ్‌లతో కార్మికుల భద్రతకు ముప్పు



మాట్లాడుతున్న జిల్లా కార్మిక సంఘాల సమన్వయ కమిటీ సభ్యులు

- నేడు కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

విజయనగరం గంటస్తంభం: లేబర్ కోడ్‌లతో కార్మికుల భద్రతకు ముప్పు పొంచి ఉందని, కార్మికుల కునష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని ఏఐఎఫ్‌టీయూ నాయకుడు బెహరా శంకరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్ రద్దు, ఎనిమిది గంటల పని, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు మే 20 తేదీన దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లా కార్మిక సంఘాల సమన్వయ కమిటీ సమావేశం ఏఐఎఫ్‌టీయు నాయకులు బెహరా శంకరరావు అధ్యక్షతన ఎల్బీజీ భవన్‌లో శనివారం నిర్వహించారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం 10 గంటలకు ఎస్పీఆర్ శ్రామిక భవన్, కె.ఎల్ పురం, సీఐటీయూ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమా వేశం నిర్వహిస్తామని చెప్పారు. స్వతంత్ర ఫెడరేషన్లు,ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయ కులు, సభ్యులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జగన్ మోహన్‌రావు, కోశాధికారి వి.రాములు, ఐఎఫ్‌టీయూ నాయకులు కె.అప్పలసూరి పాల్గొన్నారు.

శ్రీరామ్మూర్తి బాటలో పయనిద్దాం



శ్రీరామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు శంకరరావు, తదితరులు

విజయనగరం గంటస్తంభం: పేదల కోసం తన తుదిశ్వాస వరకు పోరాటం చేసిన కామ్రేడ్ రెడ్డి శ్రీరామ్మూర్తి బాటలో పయనించడం మన ముందున్న కర్తవ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు అన్నారు.

సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎల్బీజీ నగర్‌లో శ్రీరామ్మూర్తి వర్ధంతిని శనివారం నిర్వహించారు. శ్రీరామ్మూర్తి చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదే శంలో దోపిడీ లేని సమాజం కోసం కృషి చేయాలని, అందుకు ప్రజా పోరాటాలే శరణ్యమని అన్నారు. సీపీఎం నగర కమిటీ సభ్యులు బి.రమణ, రామలక్ష్మి, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

12న మండల సర్వసభ్య సమావేశం

పూసపాటిరేగ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం. రాధిక ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మహంతి కల్యాణి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండల అధికారులు, సర్పంచ్‌లు , ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఏఐవైఎఫ్ జెండాను ఎగుర వేస్తున్న బుగత అశోక్, తదితరులు

విజయనగరం గంటస్తంభం: స్థానిక ఎల్బీజీ నగర్‌లో ఏఐవైఎఫ్(అఖిల భారత యువజన సమాఖ్య) ఆవిర్భదినోత్సవాన్ని జిల్లా అధ్యక్షుడు బూర వాసు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఐవైఎఫ్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా మాజీ పధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తే గంజాయిని పూర్తిగా నిర్మూలిస్తామని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేస్తాం, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని కూటమి నాయకులు హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఏ హామీ కూడా నేరవర్చలేదని మండిపడ్డారు. వెంటనే హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ యాక్ట్ ప్రవేశ పెట్టి ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెలగాడ రాజేష్,నగర నాయకులు యశ్వంత్ , తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిందే..



శృంగవరపుకోట: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి కనకలక్ష్మి

శృంగవరపుకోట: ఆర్టికల్ 39(డి) ప్రకారం స్త్రీ, పురుషులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని దేశ కార్మికచట్టం హామీ ఇస్తోందని ఎస్.కోట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బి.కనకలక్ష్మి స్పష్టం చేశారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు అధ్యక్షతన అసంఘటిత రంగ కార్మికులకు శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి కనకలక్ష్మి మాట్లాడుతూ కార్మిక చట్టం ఉద్దేశం సాధికారతను ప్రోత్సహించడం, ఉపాధి పనుల్లో సమాన భాగస్వాములుగా వారి హక్కులను కాపాడడమే అన్నారు. పని పరిస్థితులు, వేతనాలు, ఆరోగ్యం, భద్రతా ప్రమాణా లు చట్టంలో ఉద్దేశించబడ్డాయని చెప్పారు. అసంఘటిత కార్మికులు, మహిళలకు ఏమైనా న్యాయసహాయం కావాలంటే కోర్టు ప్రత్యేకంగా న్యాయవాదిని ఏర్పా టు చేస్తుందని చెప్పారు. మండల కార్మిక సంస్థ అధికారిని రప్పించి అసంఘటిత రంగ కార్మికులకు గుర్తింపు కార్డులు అందించే ప్రక్రియ చేపడతామన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, కార్మికులు హాజరయ్యారు.

చట్టాలపై అవగాహన అవసరం

గజపతినగరం: అసంఘటిత రంగ కార్మికులంతా కార్మిక చట్టాలపై అవగాహన పెంచుకోవాలని స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఏ.విజయ్‌రాజ్‌కుమార్ సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో ఆటో కార్మికులకు కార్మిక చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, భవన నిర్మాణ, ఇతర కార్మికులు అంతా కార్మిక సంక్షేమ బోర్డు అందించే పథకాల గురించి తెలుసుకుని, వాటిని వినియోగించుకోవాలని చెప్పారు. ప్రభుత్వం కార్మికులకు ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టిందని, దానిని ప్రతీ ఒక్కరు తమ మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, రిజిస్టర్ కావాలని సూచించారు. ఈ యాప్‌లో రిజిస్టర్ చేసుకున్న కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి ప్రభుత్వం సాయం అందిస్తుందని, ఇతర ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సూచికల ఏర్పాటు



ఎత్తుబ్రిడ్జి వద్ద ప్రమాద సూచికలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

విజయనగరం: నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు కార్పొరేషన్ యంత్రాంగం చర్యలు చేపడుతోంది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ప్రమాదాలు సంభవించకుండా ఆయా మార్గాల్లో ప్రమాద సూచికలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన రహదారుల మధ్యలో డివైడర్లకు హజార్డెస్ బోర్డులు, మీడియన్ మార్కర్స్, సోలార్ స్టడ్స్ వంటివి అమర్చుతున్నారు. కార్పొరేషన్ డీఈఈ శ్రీనివాసరావు పర్యవేక్షణలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో సిబ్బంది శనివారం వీటిని అమర్చారు. డీఈఈ మాట్లాడుతూ వాహన చోదకులు తప్పనిసరిగా ప్రమాద సూచికలను గమనించి రాకపోకలు సాగించాలని కోరారు. సూర్యరశ్మితో చార్జింగ్ అయిన సోలార్ స్టడ్స్ రాత్రి సమయాల్లో వెలుతురునిస్తాయని తెలిపారు.

సమాజ అవసరాలు తీర్చేలా పరిశోధనలు



మాట్లాడుతున్న సెంచూరియన్ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు డి.ఎస్.రావు

నెల్లిమర్ల రూరల్: సమాజం, దేశ అవసరాలను దృష్టిలో పెట్టుకొని పరిశోధనలు జరపాలని సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డి.ఎస్.రావు పిలుపునిచ్చారు. మండలంలోని టెక్కలిలోని సెంచూరియన్ యూనివర్సిటీలో శనివారం ఏర్పాటు చేసిన పరిశోధనా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత సమాజంలో అనేక మార్పులు వచ్చాయన్నారు. పరిశోధకులు అధునాతన సాంకేతికతతో దేశం ఎదుర్కొంటున్న సవాళ్లపై పరిశోధనలు జరపాలన్నారు. ఇలాంటి వాటిపై పరిశోధనలు చేస్తే మంచి గుర్తింపు ఉంటుందని, సమాజ అవసరాలు కూడా తీరుతాయన్నారు. కాలం చెల్లిన వాటిపై పరిశోధనలు చేస్తే ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కార్యక్రమంలో వీసీ పి.కె. మహంతి, రిజిస్ట్రార్ పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకూడదు

- కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య



హాజరైన ఇంజినీరింగ్ సిబ్బంది, ఎమినిటీస్ కార్యదర్శులు



మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజినీరింగ్ సిబ్బంది, ఎమినిటీస్ కార్యదర్శులను విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని, ఎక్కడా పైపు లైన్లకు లీకులు లేకుండా , నీరు కలుషితం కాకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.రోజూ ఉదయం కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి నాణ్యత పరీక్షలను జరిపి నివేదికను సమర్పించాలన్నారు. నీటి వృథాను అరికట్టాలని, కులాయి పన్నులను త్వరితగతిన వసూలు చేయాలని, అనధికార కులాయి కనెక్షన్లను గుర్తించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. వారం రోజుల్లోగా అన్ని ప్రధాన జంక్షన్ల వద్దనున్న ఫౌంటెన్‌లకు చిన్న చిన్న మరమ్మతులు పూర్తి చేయాలని చెప్పారు. అలాగే వీధి దీపాల నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.రాయిల్ బాబు, డీఈలు శ్రీనివాసరావు, మణికుమార్, ప్రసాద్, ఏఈలు, ఫిట్టర్లు పాల్గొన్నారు.